క్లుప్తంగా

హైవేపైనే పశువుల తిష్ఠ



రహదారిపై సేదదీరుతున్న పశువులు

పాల్వంచరూరల్: పశువులు గుంపులు గుంపులుగా రహదారిపై తిష్ఠ వేసి సేదదీరుతుండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని లక్ష్మీదేవిపల్లి జీపీ పరిధిలో సాయిబాబా గుడి ఎదుట గల భద్రాచలం జాతీయ రహదారిపై పశువుల గుంపు నిత్యం రహదారిపై తిష్ఠ వేసి సేదదీరుతున్నాయి. వాహనాదారులు జాగ్రత్తగా వెళ్లాల్సి వస్తోంది. ఒక్కోసారి పశువులు అకస్మాత్తుగా వాహనాలకు అడ్డు వస్తున్నాయి. దీంతో ఇటు పశువులు, అటు వాహనదారులకు గాయాలవుతున్నాయి. ఇప్పటికైన అధికారులు స్పందించి జాతీయ రహదారిపై తిష్ఠ వేసిన పశువులను తరలించాలని వాహనదారులు కోరుతున్నారు.

ఎన్‌ఎండీసీ ప్లాంట్‌ను పునరుద్ధరించాలి



పొదెం వీరయ్యను సత్కరిస్తున్న నాయకులు

పాల్వంచ: పాల్వంచలోని కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఎన్‌ఎండీసీ కర్మాగారం మూతబడటంతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సన్నగిల్లాయని, కర్మాగారాన్ని తిరిగి పునరుద్ధరించాలని ఐఎన్‌టీయూసీ నాయకులు బాలునాయక్, రామునాయక్ అన్నారు. సోమవారం భద్రాచలం క్యాంప్ కార్యాలయంలో ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్యను కలిసి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో నాయకులు కిశోర్‌నాయక్, బాలునాయక్ పాల్గొన్నారు.

బెదిరింపులకు పాల్పడిన వ్యక్తిపై కేసు

పాల్వంచరూరల్: భూమి కౌలుకు ఇవ్వడం లేదని దుర్భాషలాడి, చంపుతామని బెదిరించిన వ్యక్తిపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. దుమ్ముగూడెం మండలం నర్సాపురం గ్రామానికి చెందిన బిల్లిపల్లి రుద్రమదేవికి పాల్వంచ మండలం ప్రభాత్‌నగర్‌లో తల్లిదండ్రులు పసుపు, కుంకమ కింద ఇచ్చిన మూడు ఎకరాల భూమి ఉంది. దీనిని ఈ ఏడాది గ్రామంలోని ఓ వ్యక్తికి కౌలుకు ఇచ్చింది. విషయం తెలుసుకున్న గండ్ల శశిధర్‌రెడ్డి 23వ తేదీన గొడవపడి తనకే కౌలుకు ఇవ్వాలని, లేదంటే చంపుతానని బెదిరించినట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సురేశ్ తెలిపారు.

ప్రైవేట్ స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి..

కొత్తగూడెంఅర్బన్: అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని జైభీమ్‌రావు భారత్ పార్టీ (జేబీపీ) స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎర్రా కామేశ్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. విద్యను వ్యాపారంగా మార్చేస్తూ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలోనే యూనిఫామ్స్, బుక్స్ అమ్ముతున్నా, పేద, మధ్యతరగతి తల్లిదండ్రుల నుంచి అక్రమంగా, విచ్చలవిడిగా రూ.లక్షలు వసూలు చేస్తున్నా విద్యాశాఖ అధికారులు ప్రైవేట్ పాఠశాలల వారు ఇచ్చే మామూళ్లకు అలవాటు పడి చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు ఇస్తున్న విద్యాశాఖ అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

శ్మశానంలో క్రీడా మైదానం



శ్మశానవాటికలో ఏర్పాటు చేసిన మైదానం

టేకులపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలకు ప్రాధాన్యతనిచ్చి క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం గ్రామాల్లో క్రీడా మైదానాలు ఏర్పాటు చేసింది. అందులో భాగంగానే టేకులపల్లి మండలంలోని 36 గ్రామ పంచాయతీల పరిధిలోని సుమారు వంద గ్రామాల్లో రూ.2 లక్షలతో క్రీడా మైదానాలు ఏర్పాటు చేశారు. అయితే, బొమ్మనపల్లిలో మాత్రం స్థలం ఎక్కడా దొరక్క పోవడంతో శ్మశాన వాటిక వద్దనే క్రీడా మైదానం ఏర్పాటు చేశారు. దీంతో ఇక్కడ ఆటలు ఆడేందుకు ఎవరూ సాహసం చేయడం లేదు. రూ.2 లక్షలు శ్మశానంలో పోసినట్లయిందని స్థానికులు అంటున్నారు.

అభివృద్ధి చేస్తే ఆదాయం

- అనువుగా టేకులపల్లి మార్కెట్ సబ్‌యార్డు
- అన్ని ఉత్పత్తుల కొనుగోళ్లు చేస్తే మేలు
- ఫ్లోరింగ్ నిర్మాణం, రెగ్యులర్ ఉద్యోగులను నియమిస్తేనే ఫలితం



గడ్డితో నిండిపోయిన టేకులపల్లి సబ్ యార్డు ఆవరణ

టేకులపల్లి: ఇల్లెందు వ్యవసాయ మార్కెట్ కమిటీకి అనుబంధంగా ఉన్న టేకులపల్లి సబ్ యార్డు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. సుమారు 20 సంవత్సరాలుగా నిరుపయోగంగా.. ఎలాంటి అభివృద్ధి, కొనుగోళ్లు లేక సబ్ యార్డు డీలా పడిపోయింది. ఈ క్రమంలోనే సుమారు ఐదేళ్ల నుంచి పీఏసీఎస్ సొసైటీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోళ్లకు వినియోగించారు. ఇల్లెందు ఏఎంసీ ఆధ్వర్యంలో మాత్రం ఎలాంటి కొనుగోళ్లు జరగలేదు. టేకులపల్లి మండలంలో మిర్చి, మొక్కజొన్న, పత్తి, వరి పంటలు అధికంగా పండిస్తారు. వీటితో కోట్ల రూపాయల వ్యాపారం జరుగుతుంది. ఏఎంసీ కొనుగోలు కేంద్రం లేకపోవడంతో లక్షల రూపాయల మార్కెట్ ఫీజు నష్టపోవాల్సి వచ్చేది.

మార్కెట్ చరిత్రలోనే తొలిసారి..

ఈ నేపథ్యంలోనే కార్యదర్శులు, పాలకవర్గం ప్రత్యేక చొరవతో ఇల్లెందు వ్యవసాయ మార్కెట్ కమిటీ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా టేకులపల్లి సబ్ యార్డులో మిర్చి కొనుగోలు కేంద్రాన్ని ఫిబ్రవరి 17న ప్రారంభించారు. రైతుల నుంచి విశేష స్పందన లభించింది. 28 రోజుల పాటు సాగిన కొనుగోలు కేంద్రం రైతులు, వ్యాపారులతో కళకళలాడింది. ఆ తరువాత మూగబోయింది. కేవలం ఒక్క సీజన్‌లోనే ఒకటే పంట కాకుండా ఏడాది మొత్తం అన్ని వ్యవసాయ ఉత్పత్తులు ప్రధానంగా మిర్చి, మొక్కజొన్న, పత్తి పంటలను కొనుగోలు చేసినట్లయితే ఏఎంసీకి రెట్టింపు ఆదాయం వచ్చే అవకాశం ఉంది.

రూ.కోటి టర్నోవర్..

టేకులపల్లి సబ్‌యార్డులో ఫిబ్రవరి 17న ప్రారంభమైన మిర్చి కొనుగోళ్ల వివరాలు పరిశీలిస్తే 28 రోజుల్లో 311 మంది రైతుల నుంచి 2,949 బస్తాలు అనగా 983.67 క్వింటాళ్ల మిర్చి పంటను కొనుగోలు చేశారు. తద్వారా ఏఎంసీకి రూ.కోటి టర్నోవర్ లభించింది. ఇలా ఒక్క పంటపైనే కోటి టర్నోవర్ లభిస్తే అన్ని రకాల పంటల కొనుగోళ్లు ప్రారంభిస్తే రెట్టింపు ఆదాయం తథ్యం.

అభివృద్ధి చేయాలి..

టేకులపల్లి సబ్ యార్డును అభివృద్ధి చేయాల్సి ఉంది. పంటలు ఆరబెట్టుకునేందుకు ఫ్లోరింగ్ సదుపాయం లేకపోవడం, రైతులకు విశ్రాంతి గదులు, మరుగుదొడ్లు, మూత్రశాలలు, కార్యాలయం లేక అటు రైతులు, ఇటు సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి టేకులపల్లి సబ్‌యార్డులో పంటలు ఆరబెట్టుకునేందుకు యార్డు ఆవరణ మొత్తం సీసీ ఫ్లోరింగ్ చేయాలి. రైతులకు మరుగుదొడ్లు, మూత్రశాలలు, విశ్రాంతి గదులు, కార్యకలాపాల నిర్వహణకు కార్యాలయం నిర్మించాలి. సిబ్బంది కొరత లేకుండా రెగ్యులర్ సిబ్బందిని నియమించాలని, యార్డులో అవకతవకలు జరగకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. ఏడాది మొత్తం అన్ని రకాల పంటల కొనుగోళ్లు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

అన్ని రకాల పంటలు కొనుగోలు చేయాలి



టేకులపల్లి సబ్ యార్డులో మిర్చి కొనుగోలు చేయడం వల్ల ఆదాయం వచ్చింది. ఇదే స్ఫూర్తితో ఏడాది మొత్తం అన్ని రకాల పంటల కొనుగోలు ప్రారంభించాలి. ముందుగా యార్డుని అభివృద్ధి చేయాలి. వ్యవసాయ ఉత్పత్తులు ఆరబెట్టేందుకు సిసి ఫ్లోరింగ్ చేయాలి. రైతులకు మరుగుదొడ్లు, విశ్రాంతి గదులు నిర్మించాలి.కార్యాలయం నిర్మించాలి. రెగ్యులర్ సిబ్బందిని నియమించాలి.

–రేపాకుల శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

కూలీలకు ఇన్‌కం సర్టిఫికెట్ల నిరాకరణ

లబోదిబోమంటున్న నిరుపేదలు

పాల్వంచ: సర్టిఫికెట్ల జారీలో రెవెన్యూ అధికారుల తీరు ప్రశ్నార్థకంగా మారింది. మట్టి పనిచేసుకునే కూలీలు వారి పిల్లల చదువులకు అవసరమయ్యే ఇన్‌కం సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకోగా, నెలల తరబడి తిప్పుకుని వారు ప్రభుత్వ ఉద్యోగులని సర్టిఫికెట్లను రద్దు చేశారు. పట్టణంలోని వనమా కాలనీకి చెందిన కొమరం మల్లేశ్‌కు ముగ్గురు కుమార్తెలు కాగా.. పెద్ద కూతురును బూర్గంపాడు హాస్టల్‌లో 6వ తరగతిలో చేర్పించాడు. అతడు అడ్డా కూలీగా, మట్టి పనులు చేస్తుంటాడు. కూతురు కుల, ఆదాయ సర్టిఫికెట్ల కోసం పాల్వంచ తహసీల్దార్ కార్యాలయంలో ఈ నెల 13వ తేదీన దరఖాస్తు చేసుకున్నాడు. మల్లేశ్ కేటీపీఎస్ ఉద్యోగి కాబట్టి జీతం వివరాలు సమర్పించలేదని తిరస్కరించారు. అదేవిధంగా ప్రశాంత్ కాలనీకి చెందిన లావుడ్యా వెంకన్న తన కుమారుడికి బీటెక్ కౌన్సెలింగ్ ఉండటంతో ఆదాయ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. అతడు సైతం కూలీ పనులు చేసుకుంటుండగా.. ప్రభుత్వ ఉద్యోగి అని తిరస్కరించారు. అయితే, అతని సర్టిఫికెట్‌ను నాలుగు సార్లు తిరస్కరించినట్లు చెప్పాడు. సోమవారం సదరు కూలీలు రెవెన్యూ సిబ్బంది తీరుపై అసహనం వ్యక్తం చేసి సర్టిఫికెట్ల కోసం రోజుల తరబడి తిప్పుకుంటూ సర్టిఫికెట్లను రిజెక్ట్ చేయడం సరికాదని, తమకు సర్టిఫికెట్లు అక్కరలేదని, ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పించాలని అధికారులను తిరిగి ప్రశ్నించడంతో అక్కడి వారంతా అవాక్కయ్యారు. అంతేగాక పాఠశాలలు, కళాశాలల్లో చేరే విద్యార్థులు అనేక మంది సర్టిఫికెట్ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటుండగా తప్పుల తడకగా సర్టిఫికెట్లను అందిస్తున్నారని, కార్యాలయంలో ఆయా సెక్షన్లలో సిబ్బంది దరఖాస్తులను పోగొడుతుండటంతో మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై తహసీల్దార్ దారా ప్రసాద్‌ను వివరణ కోరణగా సాంకేతిక సమస్యలు ఏమైనా ఉన్నాయా? అనేది పరిశీలించి, అర్హులకు వెంటనే న్యాయం జరిగేలా చూస్తామన్నారు.



కేటీపీఎస్ ఉద్యోగం ఉందని రెవెన్యూ అధికారులు ఇచ్చిన రశీదు

జీఓ 49ని రద్దు చేయాలి



మాట్లాడుతున్న గౌని నాగేశ్వరరావు

సింగరేణి(కొత్తగూడెం): ఆదివాసీలను ఏజెన్సీ నుంచి తప్పించేందుకు కొత్తగా తీసుకొచ్చిన జీఓ నంబర్ 49ని రద్దుచేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. రైటర్‌బస్తీలోని ఇఫ్టూ కార్యాలయంలో సోమవారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా అడవిని నమ్ముకొని జీవనం సాగిస్తున్న ఆదివాసీలను ఏజెన్సీ నుంచి వెళ్లగొట్టి.. అక్కడి ఖనిజ సంపదను కాజేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జీఓ నంబర్ 49ని తీసుకొచ్చాయని, దీంతో 399 గ్రామాలను ఖాళీ చేయించడానికి ప్రయత్నాలు సాగుతున్నాయని ఆరోపించారు. ఈ జీఓతో కొమరంభీమ్, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఏజెన్సీ గ్రామాలు కనుమరుగయ్యే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ముసలి సతీశ్, వెంకటమ్మ, సంధ్య, మంకెన వెంకటేశ్వర్లు, వల్లోజు రమేశ్, ఎన్.సంజీవ్, మోత్కూరి మల్లికార్జున్‌రావు, శరత్, అలీముద్దీన్, నాగమణి, మణెమ్మ, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

‘స్థానిక’ ఎన్నికల్లో సత్తా చాటుదాం

సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా

టేకులపల్లి: జిల్లాలో నిర్ణయాత్మక రాజకీయ శక్తిగా సీపీఐ ముందుకు సాగుతోందని పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా తెలిపారు. మండల కేంద్రంలోని వాగొడ్డుతండాలో సోమవారం నిర్వహించిన పార్టీ మండల 13వ మహాసభలో ఆయన మాట్లాడారు. ప్రజల వైపు నిలబడి ప్రశ్నించే నాయకులను తయారు చేసుకోవాల్సిన బాధ్యత ఉందని చెప్పారు. ఈ మేరకు రాబోయే స్థానిక ఎన్నికలకు కేడర్‌ను సిద్ధం చేసుకుని పార్టీ అభ్యర్థులు అత్యధిక సంఖ్యలో గెలవడం ద్వారా సత్తా చాటాలని సూచించారు. కాగా, పదవులు ఉన్నా లేకున్నా ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యలపై పోరాటాలు చేస్తున్న ఘనత కమ్యూనిస్టు పార్టీదేనని గుర్తు చేశారు. కాగా, సీతారామ ప్రాజెక్టు ద్వారా ఇల్లెందుకు నీరు ఇచ్చేంత వరకు సీపీఐ పోరాడుతుందని స్పష్టం చేశారు. అలాగే, సింగరేణి ప్రభావిత ప్రాంతాలకు ఖర్చు చేయాల్సిన సీఎస్ఆర్, డీఎంఎఫ్‌టీ నిధులు దారి మళ్లుతున్నాయని ఆరోపించారు. సమావేశంలో నాయకులు సారయ్య, జమలయ్య, నేరెళ్ల రమేశ్, గుగులోతు రామచందర్, ఎజ్జు భాస్కర్, అయిత శ్రీరాములు, నాగార్జునాచారి, గుగులోత్ శ్రీను, బానోత్ వీరన్న, కిర్లపూడి సుందర్‌పాల్, డేగల రమేశ్, జోగా కృష్ణవేణి, గుగులోత్ సోనీ, రాయల ఇందిర తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సాబీర్ పాషా

మావోయిస్టుల సమాచారం తెలపండి..

పాల్వంచరూరల్: మావోయిస్టులకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని రూరల్ ఎస్‌ఐ సురేశ్ అన్నారు. మండలంలోని రేగులగూడెం, మామిడిగూడెం గ్రామాలను సోమవారం ఎస్‌ఐ సందర్శించి గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ప్రజలు మావోయిస్టులకు సహకరించొద్దని సూచించారు. ప్రశాంత జీవనం సాగించాలని కోరారు.

తహసీల్దార్ కార్యాలయంలో ఇసుక డంప్

పాల్వంచరూరల్: పలుచోట్ల అక్రమంగా తరలిస్తున్న ఇసుకను పట్టుకుని తహసీల్దార్ కార్యాలయంలో నిల్వ చేయడంతో కార్యాలయానికి వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు కార్యాలయంలోపల దరఖాస్తు ఫారాలను నిల్వచేసే స్థలం లేక వరండాలోనే పక్కకు పడేయడంతో దరఖాస్తుదారులకు ఇబ్బందికరంగా మారింది. కాగా, తహసీల్దార్ దారా ప్రసాద్‌ను వివరణ కోరగా.. కార్యాలయం ఆరుబయట ఇసుక నిల్వలను వేలం వేశామని, పాటలో ఇసుక దక్కించుకున్న వ్యక్తికి ఇసుకను ఇక్కడి నుంచి తరలించాలని చెప్పామని తెలిపారు.

ఉద్యోగ విరమణ చేస్తున్న జీఎంలకు సన్మానం

సింగరేణి(కొత్తగూడెం): ఉద్యోగ విరమణ పొందుతున్న జీఎంలను సోమవారం డైరెక్టర్లు సన్మానించారు. పలు ఏరియాలకు చెందిన జీఎం ఈఅండ్ఎం (సోలార్) జీఎస్ జానకీరామ్, జీఎం ఈఅండ్ఎం (ట్రాన్స్‌పోర్ట్) జె.నాగరాజు, కార్పొరేట్ ఏరియా ఆడిట్ జీఎం (ఎఫ్అండ్ఏ) గొర్రెపాటి వెంకటరమణ, జీఎం డి.నారాయణరావును ఉద్యోగ విరమణ పొందుతున్న సందర్భంగా డైరెక్టర్ ఈఅండ్ఎం సత్యనారాయణరావు, డైరెక్టర్ ఆపరేషన్స్ ఎల్‌వీ సూర్యనారాయణ, డైరెక్టర్ పీపీ కె.వెంకటేశ్వర్లు సన్మానించారు. ఈ సందర్భంగా డైరెక్టర్లు మాట్లాడుతూ.. సింగరేణిలో జీఎంలు చేసిన సేవలు మరువలేనివని పేర్కొన్నారు. అంకితభావంతో విధులు నిర్వర్తించారని, సంస్థను ఉన్నత స్థితిలో నిలిపారని పేర్కొన్నారు. స్వేచ్ఛా జీవితం గడపాలని ఆకాంక్షించారు.

క్రీడాకారిణికి కలెక్టర్ అభినందన



క్రీడాకారిణిని అభినందిస్తున్న కలెక్టర్ జితేశ్

కొత్తగూడెంటౌన్: తోలెం శ్రీతేజ క్రీడల్లో మరింతగా రాణించి, జిల్లాకు పేరు తీసుకురావాలని కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ జితేశ్ వి.పాటిల్‌ను అథ్లెట్ తోలెం శ్రీతేజ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో జాతీయ, అంతర్జాతీయస్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడలశాఖ అధికారి ఎం.పరంధామరెడ్డి, అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రటరీ మహిధర్, రాజేంద్రప్రసాద్, లక్ష్మణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సబ్ జైలును తనిఖీ చేసిన జడ్జి



రికార్డులను పరిశీలిస్తున్న జడ్జి కీర్తిచంద్రికరెడ్డి

ఇల్లెందు: ఇల్లెందు సబ్ జైలును న్యాయమూర్తి దేవరపల్లి కీర్తిచంద్రికరెడ్డి సందర్శించారు. సోమవారం ఇల్లెందు సబ్‌జైలులో ఖైదీలకు అందుతున్న సదుపాయాలు, మెనూ అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. ఆరోగ్య సమస్యలపై వాకబు చేశారు. ఆర్థిక స్థోమత లేని ఖైదీలకు ఫ్రీ లీగల్ ఎయిడ్ క్లినిక్ ద్వారా న్యాయవాదిని నియమిస్తామని చెప్పారు. న్యాయమూర్తి వెంట జైలు సూపరింటెండెంట్ ఎస్.చంద్రశేఖర్, సిబ్బంది శ్రీనివాస్, సాంబ, శాంతిస్వరూప్, నవీన్, న్యాయవాది కీర్తి కార్తీక్, సిబ్బంది ఉన్నారు.

లంబాడీల హక్కుల కోసం పోరాటం



రవి రాథోడ్‌ను సన్మానిస్తున్న నాయకులు

కొత్తగూడెంటౌన్: లంబాడీ బిడ్డల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేస్తామని సేవాలాల్ సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రవిరాథోడ్ అన్నారు. సోమవారం కొత్తగూడెం బస్టాండ్ సెంటర్‌లో సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు ధరావత్ సురేశ్ అధ్యక్షతన సేవాలాల్ సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన టేకులపల్లి మండలం కొత్తతండాకు చెందిన భూక్య రవిరాథోడ్‌ను సన్మానించారు. గిరిజనుల అవకాశాలను గిరిజనేతరులు పొందుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి భూక్య శ్రీనునాయక్, సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షులు ధరావత్ సురేశ్‌నాయక్, రామునాయక్, లావుడ్య వెంకటేశ్‌నాయక్, బానోతు నాగరాజునాయక్, బట్టు హుస్సేన్‌నాయక్, జురుపుల లాలునాయక్, ప్రసాద్‌నాయక్, సీతారాంనాయక్, విజయ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్షల విభాగం ఏర్పాటు చేయండి..

కొత్తగూడెంఅర్బన్: ఉమ్మడి జిల్లా పరీక్షల విభాగం నిర్మాణం చేపట్టాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం డీఈఓ వెంకటేశ్వరాచారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ బాధ్యులు మాట్లాడుతూ.. జిల్లా విద్యాశాఖలో 2025–26 ఏడాదికి గాను ఉమ్మడి జిల్లా పరీక్షల విభాగాన్ని నిర్మాణం చేయాలని, జిల్లా సైన్స్ అధికారి ఉద్యోగ విరమణ పొందినందున ఆ పోస్టును భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి బి.రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షులు ఎం.రాజయ్య, జిల్లా కార్యదర్శులు డి.తావూరియా, ఎస్‌కే పాషా తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

గిరిజనులకే లైసెన్స్‌లు ఇవ్వాలి

జూలూరుపాడు: ఏజెన్సీ ప్రాంతంలో ఫర్టిలైజర్ షాపులు పెట్టుకోవడానికి గిరిజనులకే లైసెన్స్ ఇవ్వాలని భారతీయ గోర్ బంజారా పోరాట సమితి ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు బానోత్ దుర్గాప్రసాద్ అన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులకు లైసెన్స్ ఇవ్వాలని కోరుతూ సోమవారం కొత్తగూడెం కలెక్టరేట్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో అడిషనల్ కలెక్టర్ వేణుగోపాల్, భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో పీఓ రాహుల్‌కు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేసినట్లు ఆయన విలేకరులకు తెలిపారు. గిరిజనేతరులకు ఫర్టిలైజర్స్ లైసెన్స్ ఇవ్వడం వల్ల గిరిజన రైతులకు నష్టం జరుగుతుందని ఉన్నతాధికారులకు వివరించినట్లు ఆయన చెప్పారు.



పీఓకు వినతిపత్రం అందజేస్తున్న దుర్గాప్రసాద్

సమస్యలపై కలెక్టర్‌కు వినతి

ఇల్లెందురూరల్: మండలంలోని కొమరారం గ్రామంలో జిల్లా కలెక్టర్ జితేశ్ వి పాటిల్‌కు పలు సమస్యలపై న్యూడెమోక్రసీ, మాస్‌లైన్ నేతలు సోమవారం వేర్వేరుగా వినతిపత్రం అందజేశారు. కొమరారం కేంద్రంగా నూతన మండలం ఏర్పాటు చేయాలని, అర్హులైన గిరిజనులందరికీ పోడు పట్టాలు మంజూరు చేయాలని, ఏఎంసీ సబ్‌యార్డ్ నిర్మాణం కోసం ఐదు ఎకరాల స్థలం కేటాయించాలని, అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

సరిపడా విత్తనాలు సరఫరా చేయాలి



మాట్లాడుతున్న మండల వెంకన్న

టేకులపల్లి: వ్యవసాయ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు సరిపడా విత్తనాలు సరఫరా చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కోటేశ్వరరావు, అధ్యక్షుడు మామిడాల భిక్షపతి, ప్రధాన కార్యదర్శి మండల వెంకన్న డిమాండ్ చేశారు. సోమవారం టేకులపల్లిలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ.. రాష్ట్రంలో వ్యవసాయ సీజన్ ప్రారంభమైందని, రైతులకు సరిపడా విత్తనాలను ప్రభుత్వం అందించకపోవడంతో 95 శాతం మంది రైతులు విత్తనాల కోసం ప్రైవేట్ కంపెనీలపై ఆధారపడాల్సి వస్తోందని తెలిపారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం, సంబంధిత అధికారులు వెంటనే జోక్యం చేసుకొని నకిలీ విత్తన దందాను అరికట్టాలని కోరారు. కార్యక్రమంలో భూక్య హర్ష్య, ఎస్కే ఉమర్, బట్టు ప్రసాద్, సువర్ణపాక నాగేశ్వరరావు, ఎట్టి నరసింహారావు, భూక్య నర్సింగ్, కల్తీ సీతారాములు, బత్తిని సత్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలకు నిలయంగా వంతెనలు

జూలూరుపాడు: మండలంలోని పలు గ్రామాల్లో వంతెనలు ప్రమాదకరంగా పరిణమించాయి. బ్రిడ్జిలపై రెయిలింగ్ ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. భేతాళపాడు గ్రామ సమీపంలోని పెద్దవాగుపై నిర్మించిన బ్రిడ్జిపై సైడ్ వాల్స్ (రెయిలింగ్) లేకపోవడంతో మార్చి 25న కూలీలతో వెళ్తున్న ట్రాలీ వాహనం పల్టీ కొట్టడంతో 23 మంది గాయపడ్డారు. ఈ ప్రమాదం జరిగి మూడు నెలలు గడుస్తున్నప్పటికీ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం గమనార్హం. గుండ్లరేవు గ్రామ సమీపంలోని పెద్దవాగుపై నిర్మించిన బ్రిడ్జి ప్రమాదకరంగా ఉంది. భేతాళపాడు – పడమటనర్సాపురం, అనంతారం – కాకర్ల, కాకర్ల – దుబ్బతండా, కాకర్ల – గానుగపాడు గ్రామాల మధ్య గల వాగులపై నిర్మించిన బ్రిడ్జిలు ప్రమాదాలకు నిలయంగా ఉన్నాయి. ఈ బ్రిడ్జిలపై రెయిలింగ్ ఏర్పాటు చేయకపోవడంతోపాటు, నిర్మించిన దిమ్మెలు ఇరిగిపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వర్షాలకు బ్రిడ్జీలపై నుంచి వరదనీరు ప్రమాదకరస్థాయిలో ప్రవహిస్తుంటాయని ప్రజలు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



భేతాళపాడు సమీపంలో పెద్దవాగు బ్రిడ్జిపై రెయిలింగ్ లేని దృశ్యం



బ్రిడ్జి పైనుంచి పెద్దవాగులో పడిన ట్రాలీ (ఫైల్)